సాక్షి మంచిర్యాల

మంగళవారం । 23 । జనవరి । 2024



'ప్రత్యేక' పాలన

స్థానికసంస్థల ఎన్నికలు ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత సర్పంచుల పదవీ కాలం ఫిబ్రవరి 1తో ముగియనుంది. ఎన్నికలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. 10లో▸

సీడీఎంఏను కలిసిన మున్సిపల్ కమిషనర్



బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ భుజంగరావు సీడీఎంఏ(కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) దివ్య దేవరాజన్, ఏడీఎంఏ జాన్‌శ్యాంసన్‌ను సోమవారం మ ర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ వెళ్లిన మున్సిపల్ కమిషనర్ సీడీఎంఏను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.3 /21.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. చలి ప్రభావం చాలా వరకు తగ్గుతుంది.

న్యూస్‌రీల్

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ బి.సంతోష్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బి. సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈనెల 26న గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ బి.సంతోష్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణతో కలిసి గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేడుకల్లో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ శాఖల్లో అత్యుత్తమ సేవలు అందిస్తున్నవారితోపాటు వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చినవారిని పురస్కారాలకు ఎంపిక చేయాలని సూచించారు. అన్ని శాఖల పురోగతిని తెలియజేస్తూ ప్రగతి నివేదిక సిద్ధం చేయాలని, శాఖల వారీగా శకటాల ప్రదర్శన ఏర్పాటు చేయాలని వివరించారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రేపు మినీ జాబ్‌మేళా

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 24న మినీ జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక వెంకటరమణ తెలిపారు. వినయ్ ఆటోటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్ 10, మెకానిక్‌లు, హెల్పర్లు 06, డ్రైవర్ 01, అకౌంటెంట్ 01 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు డిగ్రీ అర్హత కాగా, మెకానిక్ హెల్పర్‌కు ఐటీఐ లేదా డిప్లొమా, డ్రైవర్ పోస్టుకు డ్రైవింగ్‌లైసెన్స్ బ్యాడ్జ్, ఎకౌంటెంట్‌కు డిగ్రీ ట్యాలీ అర్హతలు ఉండాలన్నారు. 18–25 ఏళ్ల పురుష అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు మంచిర్యాల జిల్లాలో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు.

ప్రశాంతంగా పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో ఖాళీ ఉన్న టిండాల్, టిండాల్ సూపర్వైజర్, కార్పెంటర్, బిట్ షార్ప్‌నర్ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకున్న అంతర్గత అభ్యర్థులకు సోమవారం ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. ఏరియా వర్క్‌షాప్‌లో ఏరియా ఎస్‌ఓటూజీఎం కె.రఘుకుమార్ సమక్షంలో పరీక్షలు నిర్వహించారు. ప్రాక్టికల్ పరీక్షలో వచ్చిన మార్కుతో వారి ప్రతిభను బట్టి ఈ పోస్టులు భర్తీ చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు , డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, ఏజెంట్ గోపాల్‌సింగ్, వర్క్‌షాప్ ఇన్‌చార్జి మల్లయ్య, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

హెల్త్ ప్రొవైడర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఒప్పంద ప్రాతిపదికన మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీబీఎస్/బీఏఎంఎస్/బీఎస్సీ నర్సింగ్/జీఎన్ఎం అభ్యర్థులు (2020 సంవత్సరం కంటే ముందు ఉత్తీర్ణులైన బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులు, జీఎన్ఎం అభ్యర్థులు విధిగా 6 నెలల కమ్యూనిటీ హెల్త్ బ్రిడ్జి కోర్సు పూర్తి చేసి ఉండాలి) దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారం, ఇతర వివరాల కోసం మంచిర్యాల జిల్లా అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను ధ్రువీకరణాల జిరాక్స్ కాపీలు జతచేసి ఈనెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో అందించాలని వివరించారు.

ఎంబీబీఎస్ ఫస్టియర్‌లో 98 శాతం ఉత్తీర్ణత

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొదటి బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థుల ఫస్ట్ ఇయర్ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. మొత్తం 100 మంది పరీక్షలు రాయగా, 98 మంది పాసయ్యారు. ఆరుగురు డిస్టింక్షన్ మార్కులు సాధించారు. 58 మంది ఫస్ట్‌క్లాస్‌లో, 34 మంది సెకండ్‌క్లాస్‌లో పాసయ్యారు. మొదటి బ్యాచ్‌లోనే మంచి ఫలితాలను సాధించడంపై వైద్య కళాశాల బోధనా సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

జై శ్రీరాం

- ఊరూరా మార్మోగిన నామం
- పండుగలా అయోధ్య రామోత్సవం
- కాషాయమయమైన జిల్లా..
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ర్యాలీలు, శోభాయాత్రలు



సీతారాముడు, భరత శత్రఘ్నులు, హన్మంతుడి వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు

జెండా ఊపి శోభాయాత్ర ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

ఆకట్టుకున్న సీతారాముల వేషధారులు



హనుమాన్ వేషధారణతో..



నృత్యం చేస్తున్న మార్వాడీ మహిళలు



శోభాయాత్రలో మహిళల కోలాటం



నస్పూర్‌లో దీపారాధన

మంచిర్యాలఅర్బన్: మన రాముడు వచ్చాడు.. అయోధ్య రామ మందిరంలో కొలువుదీరాడు. దశాబ్దాల కల సాకారమైంది. అభిజిత్ లగ్నంలో సోమవారం మధ్యాహ్నం 12:30 గంటలకు ప్రధాని మోదీ రామ్ లాల్లాకు ప్రాణ ప్రతిష్ఠ చేశారు. జగదానంద కారకుడు.. జయజానకీ ప్రాణ నాయకుడికి జిల్లా వాసులు ఘన స్వాగతం పలికారు. ఊరూవాడ రామనామంతో మార్మోగింది. కూడళ్లు, ఆలయాల ఆవరణలో ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్లపై బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కనులారా వీక్షించారు. ప్రసన్న వదనం, చిరు దరహాసం, స్వర్ణాభరణాలతో, ఎడమ చేతిలో విల్లు, కుడి చేతిలో బాణంతో దర్శనమిచ్చిన బాల రాముడిని చూసి భక్తులు పులకించారు. ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం అన్నదానాలు, ర్యాలీలు, శోభాయాత్రలు నిర్వహించారు. మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలో త్రిదండి శ్రీరామానుజ దేవనాథ జీయర్‌స్వామి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీసీతారాముల దేవతామూర్తులను అశ్వరథంపై ఉంచగా, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు శోభాయాత్రను ప్రారంభించారు. యాత్ర పొడవునా కోలాటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జైశ్రీరాం నినాదాలు మార్మోగాయి. డీజే పాటలకు భక్తులు స్టెప్పులేశారు. ఓవర్ బ్రిడ్జి, మార్కెట్ రోడ్ పురవీధుల మీదుగా బాయ్స్ హైస్కూల్ గ్రౌండ్ వరకు శోభాయాత్ర కొనసాగింది. చిన్నారుల నుంచి పెద్దల వరకు సీతారామచంద్ర పట్టాభిషేక ఘట్టాన్ని కళ్లకుకట్టినట్లుగా రామలక్ష్మణ, భరత, శత్రఘ్నుల వేషధారణాలతో వాహనాలపై ఆసీనులయ్యారు. గౌతమీనగర్ కోదండ రామాలయంలో ఎల్ఈడీ స్క్రీన్‌పై బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠను వీక్షించారు. కోదండ రామాలయ ప్రాంగణంలో దీప జ్యోతులు వెలిగించి అశ్వ వాహనంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలు ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. పాత గర్మిళ్ల భక్తాంజనేయ ఆలయంలో భక్తులు రామనామ కీర్తనతో పటించారు. సుందరాకాండ పారాయణం చేశారు. రామ మందిర విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని స్క్రీన్‌పై ప్రత్యక్ష ప్రసారం ద్వారా భక్తులు వీక్షించారు.



మంచిర్యాలలో శ్రీరామునికి దీపారాధన



జనసందోహంగా మారిన మంచిర్యాల హనుమాన్ జంక్షన్



బెల్లంపల్లిలో నిర్వహించిన శోభాయాత్రలో మహిళల కోలాటం

వడ్లు అమ్మి.. బియ్యం కొంటుండ్రు

- 'సీఎంఆర్' కోసం మిల్లర్ల కొత్త దారులు
- మిల్లింగ్ చేయలేక.. బియ్యం కొని అప్పగింత
- బ్లాక్ లిస్టులో పడకుండా జాగ్రత్తలు



ఇందారంలోని ఓ రైస్ మిల్లులో ఏపీ నుంచి కొనుగోలు చేసిన బియ్యం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సీఎంఆర్ (కస్టం మిల్లింగ్ రైస్) గడువు ముంచుకొస్తున్నకొద్దీ కొందరు మిల్లర్లు కొత్త దారులు వెతుకుతున్నారు. బియ్యం ఇవ్వకుండా జాప్యం చేసినవారు ఇప్పుడు రెడీమేడ్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుండడంతో సీఎంఆర్ అప్పగింతకు మిల్లర్లు అపసోపాలు పడుతున్నారు. ఈనెల 31 వరకు లక్ష్యం మేరకు అప్పగించాలని అధికారులు స్పష్టం చేశారు. కానీ, ఇప్పటికీ యాసంగిలో 29 శాతమే అప్పగించారు. వారమే గడువు ఉండడంతో వడ్లు అమ్మి బియ్యం కొనుగోలుకు సిద్ధమవుతున్నారు.

హెచ్చరికలు, నోటీసులు, జరిమానాలు,

ఏటా వానాకాలం, యాసంగిలో సర్కారు రైతుల నుంచి కొనుగోలు చేసి ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగిస్తోంది. కస్టం మిల్లింగ్ కింద ఆ ధాన్యాన్ని మరాడించి బియ్యంగా ఇవ్వాలి. చాలామంది మిల్లర్లు కూలీల కొరత, విద్యుత్ కోతలు, యంత్రాల రిపేర్లు, నూక వస్తుందన్న కారణాలతో జాప్యం చేస్తున్నారు. అధికారుల హెచ్చరికలను పట్టించుకోవడం లేదు. 2021–22 యాసంగి సీఎంఆర్ జాప్యం చేసిన 19 మిల్లులకు మొత్తం రూ.51 కోట్ల జరిమానా పడింది. 2021–22లో రెండు సీజన్లకు ఇంకా 3,600 మెట్రిక్ టన్నుల బియ్యం అందించాల్సి ఉంది. గత సీజన్ల లక్ష్యం చేరలేదు. మిల్లుల సామర్థ్యానికి మించి ధాన్యం కేటాయింపులతో కొందరు ధాన్యాన్ని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖకు ఇచ్చే కోటాలో రేషన్ బియ్యం కలిపి అప్పగిస్తున్నారు.

ఎఫ్‌సీఐకి పెండింగ్

సీఎంఆర్ ఇవ్వాల్సినవి ఎఫ్‌సీఐకి అందించాల్సిన కోటానే ఎక్కువగా ఉంది. ఎఫ్‌సీఐ బియ్యం పాస్ చేసేప్పుడు నూకశాతం, నాణ్యత, రీసైక్లింగ్ ఇవన్నీ పక్కాగా పరిశీలిస్తారు. బియ్యం మిల్లింగ్ చేసేప్పుడు నూక ఎక్కువ వస్తే, ఒక కింటాల్‌కు 68 కిలోలకు తక్కువగా వస్తుంది. దీంతో అడ్డదారులు వెతుకుతున్నారు. ఏకంగా బియ్యాన్నే కొనుగోలు చేసి ఎఫ్‌సీఐకి అందించే పనిలో ఉన్నారు. జైపూర్‌లో ఓ మిల్లు ఏపీ నుంచి బియ్యం కొనుగోలు చేసి తెచ్చి సీఎంఆర్ కింద ఇచ్చేందుకు సిద్ధపడింది. కొందరు మిల్లర్లు మిల్లింగ్ చేయడం కన్నా, కొనుగోలు చేసి ఇవ్వడమే మేలనుకుంటున్నారు.

సీఎంఆర్ వివరాలు (విలువ మెట్రిక్ టన్నుల్లో)

2022–23	ఖరీఫ్(వానాకాలం)	రబీ (యాసంగి)
మిల్లర్లకు ఇచ్చిన ధాన్యం	80,336	62,086
బియ్యం (సీఎంఆర్) ఇచ్చింది	51,896	17,784
ఇంకా ఇవ్వాల్సింది	28,440	44,302
మిగిలింది	28,440	44,302
పూర్తయింది (శాతం)	65	29



బియ్యం ఇచ్చేలా చర్యలు

సీఎంఆర్ పెండింగ్ ఉన్న మిల్లుల నుంచి ఈ నెల 31లోపు బియ్యం అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం.

– గోపాల్, డీఎం, జిల్లా పౌర సరఫరాలశాఖ

సమన్వయంతో అర్జీల పరిష్కారం

- కలెక్టర్ బి.సంతోష్
- ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్‌బి. సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణికి వచ్చిన అర్జీల పరిష్కారానికి సమన్వయంతో పనిచేస్తున్నామని కలెక్టర్ బి.సంతోష్ తెలిపారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు రాహుల్, మోతిలాల్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శేషాద్రి, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు.

- కాసిపేట మండలం దుబ్బగూడెం గ్రామానికి చెందిన మామిడి హన్మాండ్లు, పులి లింగయ్య, బోయిని సంతోష్, బోయిని నరేష్, బోయిని దేవమ్మ, మంద నర్సయ్య కళ్యాణిఖని ఓపెన్ కాస్టు ప్రాజెక్టు కింద నష్టపోతున్న ఇళ్లకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇప్పించాలని దరఖాస్తులు ఇచ్చారు.
- మంచిర్యాల పట్టణంలో సూర్యనగర్‌కు చెందిన క్యాతం లక్ష్మి తన భర్త పేరిట దొరగారిపల్లె గ్రామ శివారులోని 2 సర్వే నంబర్లలో భూమి ఉందని, ఈ భూమి విరాసత్‌కు దరఖాస్తు చేసుకుంటే ఒక సర్వే నంబర్ మిస్సింగ్ జాబితాలో నమోదు చేశారని అర్జీ పెట్టుకుంది.
- లక్సెట్టిపేటకు చెందిన గొర్ల శంకయ్య తనకు తాతల నుంచి వంశపరంగా వస్తున్న భూమి ఊత్కూర్ శివారులో ఉందని, ఈ భూమికి పట్టాదారు పాసుపుస్తకం ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నాడు.
- జైపూర్ మండలం రామారావుపేట గ్రామానికి చెందిన అగ్గు లక్ష్మి, అగ్గు మౌనిక తమకు తుర్కపల్లి గ్రామ శివారులో ఉన్న భూమిని కొందరు అక్రమంగా పట్టా చేయించుకున్నారని, ఆ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరారు.
- చెన్నూర్ మండలం దుగ్నెపల్లి గ్రామానికి చెందిన దుర్గం శ్యామ్‌చంద్ తనకు దేవులగూడ గ్రామ శివారులో ఉన్న భూమికి సంబంధించి ధరణిలో వివరాలు నమోదు చేసి పట్టా పాసు పుస్తకం ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నాడు.
- లక్సెట్టిపేట మండల గుల్లకోట గ్రామానికి చెందిన కొల మల్లేశం ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపులో కోల్పోయిన భూమికి పరిహారం ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నారు.
- మంచిర్యాల మున్సిపాలిటీలోని రెడ్డికాలనీకి చెందిన శివరాత్రి పుష్ప తాను కూలీపని చేసుకుంటూ జీవిస్తున్నానని, తన భర్త చనిపోయాడని, ఇద్దరు పిల్లల పోషణ భారంగా ఉందని, అంత్యోదయ రేషన్‌కార్డు ఇప్పించాలని కోరింది.

వందశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా

- 'పది' విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- 23, 24న సమీక్ష సమావేశం

మంచిర్యాలఅర్బన్: ఈ ఏడాది మార్చిలో పదో తరగతి పరీక్షలు జరుగనున్నాయి. ఈసారి వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. డిసెంబర్ నాటికి పదో తరగతికి సంబంధించి పాఠ్య ప్రణాళిక పూర్తిచేయాల్సి ఉన్నా కొన్ని పాఠశాలల్లో 80 నుంచి 90 శాతం మేరకు కూడా పూర్తి చేయలేదని తెలుస్తోంది. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు, శాసనసభ ఎన్నికలు బోధనకు అడ్డంకిగా మారాయి. ఇటీవల కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి పదో తరగతి సిలబస్, పరీక్షలకు సన్నద్ధతపై చర్చించారు.

సబ్జెక్టుల వారీగా వివరాల సేకరణ..

పాఠశాలల వారీగా సిలబస్ ఏమేరకు పూర్తి చేశారనే అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. విద్యార్థుల సంఖ్య, ఎస్ఏ–1లో విద్యార్థులు సాధించిన మార్కుల శాతంపై ఆరా తీస్తున్నారు. ఈనెల 31నాటికి వంద శాతం సిలబస్ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థుల ప్రగతికి సంబంధించిన ఫార్మాట్‌లో వివరాలు నమోదు చేసి విద్యాశాఖకు సమర్పించాల్సి ఉంటుంది.

మండలాల వారీగా సమీక్ష..

ప్రభుత్వ, లోకల్ బాడీ, కేజీబీవీ, టీఎస్ఎంఎస్‌లకు చెందిన ప్రధానోపాధ్యాయులు, స్పెషల్ ఆఫీసర్లు, ప్రిన్సిపాళ్లతో పదో తరగతి పరీక్షల సన్నద్ధత, విద్యార్థుల గ్రేడింగ్, సిలబస్‌పై మండలాల వారీగా రివ్యూ చేయనున్నారు. జిల్లాసైన్స్ కేంద్రంలో ఈనెల 23న జన్నారం, తాండూర్, కాసిపేట్, నెన్నెల్, బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, కోటపల్లి, వేమనపల్లి, 24న దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్, నస్పూర్, మందమర్రి, మంచిర్యాల, జైపూర్, భీమారం, చెన్నూర్ మండలాలకు సంబంధించి రివ్యూ చేయనున్నారు.

పునశ్చరణపై దృష్టి..

నవంబర్‌లో ఎన్నికల నేపథ్యంలో పాఠ్య ప్రణాళిక పూర్తి చేయడంలో కొంత జాప్యం జరుగుతుంది. తర్వాత కావాల్సిన పాఠ్యాంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టినా పూర్తి చేయలేకపోయారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండటంతో కలెక్టర్ సంతోష్ విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో సబ్జెక్టులు పూర్తికానట్లు తేలింది. దీంతో ఎందుకు సబ్జెక్టు పూర్తి చేయలేకపోయారు..? ఏ పాఠశాలల్లో సబ్జెక్టులు పూర్తిచేయలేదో..? కారణాలు.. వందశాతం ఉత్తీర్ణత లక్ష్యంకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. విద్యాశాఖ ఆదిశగా సమీక్షలు నిర్వహించి శత శాతం ఫలితాలపై దృష్టి సారించింది.

ఇసుక రీచ్ ప్రారంభం



ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, అదనపు కలెక్టర్ మోతీలాల్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ శివారులోని గోదావరి తీరంలో గనులు, భూగర్భ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్‌తో కలిసి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ప్రారంభించారు. మన ఇసుక వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ కారణంగా గతంలో గోదావరి నుంచి ఇసుక రవాణకు ఆటంకాలు ఏర్పడేవన్నారు. గోదావరిలో నీరు తగ్గుముఖం పట్టడంతో దళారుల ప్రమేయం లేకుండా ఇసుక పాలసీ నిబంధనలకు అనుగుణంగా కలెక్టర్ సహకారంతో ఇసుక రీచ్ ప్రారంభించామన్నారు. ఇసుక రీచ్ వ్యవహారం అంతా కూడా మైనింగ్ శాఖ ఆన్‌లైన్ ద్వారా చేపడుతుందని, ఉదయం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు రీచ్ నిర్వహణ సాగాలన్నారు. కార్యక్రమంలో వేంపల్లి సర్పంచ్ వోలపు శారద, ఎంపీటీసీ డేగ బాపు, కాంగ్రెస్ నాయకులు పూస్కూరి శ్రీనివాసరావు, సంజయ్‌రావు, తిరుపతి, శ్రీనివాసగౌడ్, మైనింగ్ ఏడీ బాలు, నాయబ్ తహసీల్దార్ హరిత, పంచాయతీ కార్యదర్శి ప్రతిభ, ఎస్సై నరేశ్‌కుమార్, ట్రాక్టర్ యజమానులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మిస్సింగ్ కేసు


దిగిడ లావణ్య

దహెగాం: మండలంలోని కుంచవెల్లి గ్రామానికి చెందిన యువతి అదృశ్యమవడంతో సోమవారం మిస్సింగ్ కేసు నమోదైంది. ఎస్సై సనత్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దిగిడ లావణ్య(20) ఈనెల 18న ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. యువతి తండ్రి శంకరయ్య ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కార్మికుడికి గాయాలు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–5 గనిలో సోమవారం రెండో షిఫ్టులో జరిగిన ప్రమాదంలో యాసిన్ అనే సపోర్ట్‌మెన్ కార్మికుడి కాలికి గాయమైంది. గనిలోని 34 లెవల్‌లో విధులు నిర్వహిస్తుండగా అకస్మాత్తుగా సైడ్ పెల్లలు కూలి రెండు కాళ్లపై పడ్డాయి. వెంటనే కేకే–డిస్పెన్సరీకి తరలించగా ఐదు కుట్లు వేసి రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఏరియా ఆసుపత్రికి పంపించారు.

షార్ట్ సర్క్యూట్‌తో షాప్ దగ్ధం

మందమర్రిరూరల్: మందమర్రిలోని అలెక్స్‌మెన్స్ పార్లర్, హేర్ స్టైల్స్‌షాప్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధితుడు సుధాకర్ తెలిపిన వివరాలు.. సోమవారం సాయంత్రం సుమారు 6.30 గంటలకు షాపు మూసివేశాను. మార్కెట్ వర్తక వ్యాపారకమిటీ ఆధ్వర్యంలో రాముని శోభాయాత్రకు వెళ్లాను. కొద్దిసేపటికే షాపులో నుంచి పొగలురావడంతో స్థానికులు సమాచారం అందించారు. అప్పటికే షాపులో ఏసీ, టీవీ, కుర్చీలు తదితర విలువైన వస్తువులు కాలిపోయాయి. సుమారు రూ.6 లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితుడు తెలిపారు. ఆర్ఐ పద్మజ ప్రమాదం జరిగిన తీరును బాధితుడిని అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉంటే మంటలు చెలరేగినప్పుడు ఫైర్ స్టేషన్‌కు కాల్ చేస్తే మంటలార్పిన గంట తర్వాత ఫైరింజన్ రావడం విశేషం.

సిలిండర్ లీకై మంటలు



లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల గ్రామంలో ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వ్యాపించాయి. సోమవారం రాత్రి వంట చేసుకుందామని గ్యాస్ ముట్టించడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. గదిలో ఉన్న ఫ్రిడ్జి, కూలర్, మిక్సీ, వంటసామగ్రి, అర తులం బంగారం, రూ.16 వేల నగదు కాలిపోయాయి. సుమారు రూ.లక్ష వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు నస్పూరి సత్తయ్య తెలిపారు. స్థానికులు మంటలార్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేటస మీపంలోని జాతీయ రహదారి వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. కిష్టంపేటకు చెందిన మిద్దెపాక సమ్మయ్య(42) బైక్‌పై మంచిర్యాల నుంచి చెన్నూర్ వైపు వెళ్తుండగా లారీ వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. సమ్మయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తమకు న్యాయం చేయాలని జాతీయ రహదారి వద్ద కుటుంబ సభ్యులు బైఠాయించారు.

‘ప్రత్యేక’ పాలన

- ఫిబ్రవరి1తో ముగియనున్న సర్పంచుల పదవీ కాలం
- రిజర్వేషన్లపై సందిగ్ధం


హాజీపూర్ పంచాయతీ కార్యాలయం

నెన్నెల: స్థానికసంస్థల ఎన్నికలు ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత సర్పంచుల పదవీకాలం ఫిబ్రవరి 1తో ముగియనుంది. ఇప్పటికి రాష్ట్రప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలపలేదు. దీంతో ఎన్నికలు నిర్దేశిత గడువులోపు జరగవని, ప్రత్యేక అధికారుల పాలన తప్పనిసరని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ప్రత్యేక అధికారుల నియామకానికి సంబంధించిన కసరత్తును పూర్తిచేసేందుకు అవసరమైన ఏర్పాట్లలో అధికారులు నిమజ్ఞమయ్యారు. ఇందులో భాగంగానే మండలస్థాయి అధికారుల సమాచారం సేకరిస్తున్నారు.

పర్సన్ ఇన్‌చార్జిలకు అవకాశం లేని కొత్త చట్టం..

నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం నిర్దేశిత గడువులోపు ఎన్నికలు నిర్వహించాల్సిందే. లేదంటే ప్రత్యేక అధికారులు నియమించి పల్లె పాలనను కొనసాగించాల్సి ఉంటుంది. పదవీకాలం పూర్తయిన తదనంతరం ఆయా పాలకవర్గాలను పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగించేందుకు కొత్త చట్టం అనుమతించడం లేదు. అలా వారిని నియమించాలంటే అసెంబ్లీలో చట్టసవరణ లేదా ఆర్డినెన్స్‌ను తేవాల్సి ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనకే మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది.

రిజర్వేషన్లపై సందిగ్ధం..

పదేళ్ల పాటు రిజర్వేషన్లు ఉండేలా నూతన పంచాయతీరాజ్ చట్టంలో పొందపర్చారు. 2018లో ఎన్నికలు నిర్వహించిన సమయంలో నిర్దేశించిన రిజర్వేషన్‌లు పదేళ్ల పాటు అమలులో ఉంటాయని వెల్లడించారు. ప్రస్తుత ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లు పెంచుతామని ఎన్నికల హామీలో ప్రకటించింది. బీసీ గణన చేపట్టి ఆయా గణంకాల ఆధారంగా రిజర్వేషన్లు నిర్ధారిస్తామని వెల్లడించింది. పంచాయతీల సంఖ్య పెరిగిన నేపథ్యంలో రిజర్వేషన్ల మార్పు తప్పనిసరిగా కనిపిస్తుంది. ఈ విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అప్పటివరకు సందిగ్ధత కొనసాగుతుంది.

జిల్లాలు	పంచాయతీలు
మంచిర్యాల	311
కుమురం భీం	335
ఆదిలాబాద్	468
నిర్మల్	396

మండల స్థాయి అధికారులతో..

గ్రామ పంచాయతీలకు మండల స్థాయి అధికారులను నియమించనున్నట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో భాగస్వామ్యం లేని శాఖలకు చెందిన అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించాలనే ఆలోచనలో జిల్లా యంత్రాంగం ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మండల పరిషత్‌లోని సూపరింటెండెంట్, ఎంపీవో, వ్యవసాయాధికారులు, పశు వైద్యాధికారులు, ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన ఏఈలను నియమించనున్నారు. మేజర్ పంచాయతీలకు జిల్లాస్థాయి అధికారులను నియమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

సార్వత్రిక ఎన్నికల తర్వాతే పల్లెపోరు

రాష్ట్రంలో అధికారంలో చేపట్టిన కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని పనిచేస్తోంది. మెజార్టీ స్థానాలను కైవసం చేసుకునేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకుంది. ఆరు గ్యారంటీల అమలుకు దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈనెల 20వ తేదీ నుంచి ఇంటింటా సర్వే చేపట్టి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తుల ఆధారంగా అర్హులను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మే నెలాఖరులోగా పూర్తిచేసిన తర్వాతే జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ఏక కాలంలో నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం

- జీఎం సంజీవరెడ్డి


ఏర్పాట్లు పరిశీలిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: నస్పూర్ గోదావరి కాలనీలోని ప్రాణహిత స్టేడియంలో ఈనెల 26న 75వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్టేడియంలో సందర్శించి వేడుకలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల నూతనంగా ఇక్కడ ప్రాణహిత క్రీడా మైదానం ఏర్పాటు చేశామని, ఇందులో తొలిసారిగా వేడుకలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆయా గనుల్లో ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసి వారికి సన్మానం చేసి, ప్రశంసపత్రాలు అందించనున్నట్లు తెలిపారు. అదే విధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, పురప్రజలు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. శ్రీరాంపూర్ ఏరియా ఎస్ ఓటుజీ కె.రఘుకుమార్, డీజీఎం (పర్సనల్) పి.అరవిందరావు, డీజీఎం (సివిల్) ఆనంద్ కుమార్, సీనియర్ సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, సీనియర్ పీవో కాంతారావు, సివిల్ ఈఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

ట్యాంకర్ ఢీకొని కారుబోల్తా

- ఒకరికి తీవ్రంగా, పలువురికి స్వల్పగాయాలు


బోల్తా పడిన కారు

కాసిపేట: ట్యాంకర్ ఢీకొని కారు బోల్తా పడిన ఘటన కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి ఫ్లైఓవర్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలాఉన్నాయి.. ఆసిఫాబాద్‌కు చెందిన మైస రమ్యకృష్ణ, భర్త రమేశ్, పగిడి మాధవి మరో 7 ఏడేళ్ల చిన్నారి కారులో మందమర్రి వైపు నుంచి ఆసిఫాబాద్ వెళ్తున్నారు. ఈక్రమంలో ఓవర్ టేక్ చేస్తూ హైవే పనులు నిర్వహించే హెచ్‌జీ ఇన్‌ఫ్రా కంపెనీకి చెందిన ట్యాంకర్ కారును ఢీకొంది. సుమారు 50 మీటర్లకు పైగా కారు రోడ్డుపై లాక్కెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న రమ్యకృష్ణ తీవ్ర గాయాలయ్యాయి. మిగతావారికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను బెల్లంపల్లి ఆస్పత్రికి తరలించారు. కాగా, కారులోని ఎయిర్‌బ్యాగులు తెరుచుకోవడంతో ప్రమాదం తప్పింది. లేకపోతే బ్రిడ్జి కిందకు పడిపోయేది. ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదం జరగడంతోపాటు ముందు ఉన్న మరో కారును ఢీకొట్టింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగారాం తెలిపారు.

బోర్‌వెల్ లారీబోల్తా

- అతివేగంతో డివైడర్‌ను ఢీకొట్టగా ప్రమాదం
- రెబ్బెన మండలం ఖైరిగాం వద్ద జాతీయ రహదారిపై ఘటన
- ఒకరి మృతి, పలువురికి తీవ్ర గాయాలు


దీరన్ మృతదేహం


బోల్తాపడిన బోర్‌వెల్ లారీ

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలం ఖైరిగాం వద్ద బోర్‌వెల్ లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కూలీ ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమం, మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం.. ఆసిఫాబాద్‌కు చెందిన తిరుమల బోర్‌వెల్స్‌కు చెందిన బోర్‌వెల్ లారీ సోమవారం రాత్రి కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వైపు నుంచి ఆసిఫాబాద్ వైపు వెళ్తోంది. మార్గమధ్యలో ఉన్న ఖైరిగాం వద్ద జాతీయ రహదారి ఫ్లైఓవర్‌పై డ్రైవర్ అతివేగం, అజాగ్రత్తగా వాహనాన్ని నడపటంతో అదుపు తప్పి కుడివైపున డివైడర్‌ను ఢీకొట్టింది. వాహనంలో ఉన్న కలకత్తాకు చెందిన కూలీ దీరన్ (40) అక్కడికక్కడే మృతి చెందగా, గుడిహత్నూర్‌కు చెందిన డ్రైవర్ చిత్రుతోపాటు కలకత్తాకు చెందిన కూలీలు అరవింద్, ఆనంద్, సమీర్ లాల్, లాల్ చంద్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ ఘటన స్థలానికి చేరుకుని జిత్రు, అరవింద్, ఆనంద్‌లను బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి, సమీర్‌లాల్, లాల్ చంద్‌లను ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ చిత్రు పరిస్థితి విషమంగా ఉంది. లారీ బోల్తాపడటంతో ఆసిఫాబాద్ వైపు నుంచి రెబ్బెన వైపు వచ్చే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నేషనల్ హైవే సిబ్బంది సహకారంతో ఎస్సై.. లారీని క్రేన్ సహాయంతో తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

మహిళా సాధికారిత దిశగా ముందుకు సాగుదాం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బాలికలు, మహిళల సంరక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం మహిళా సాధికారత హబ్ పని చేస్తుందని మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్ మౌనిక, ఫైనాన్షియల్ లిటరసీ లిప్సిక అన్నారు. హాజీపూర్ ఎంపీపీ కార్యాలయ సమావేశ మందిరం, ముల్కల్ల ప్రాథమిక పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు కార్యక్రమాల్లో మాట్లాడారు. జిల్లా సంక్షేమాధికారి ఆదేశాల మేరకు మహిళా సాధికారత హబ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బేటి బచావో.. బేటి పడావో, బాలికలు, మహిళల సంరక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమాలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, మహిళా హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబర్లకు సమాచారం అందజేసేలా చూడాలని అవగాహన కల్పించారు. ఎంపీపీ స్వర్ణలత, ఎంపీటీసీలు సుజాత, అనూబాయి, పశువైద్యాధికారులు సరిత, శాంతిరేఖ, మండల వైద్యాధికారి లహరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత పాల్గొన్నారు.

కరసేవకులకు సన్మానం

పాతమంచిర్యాల: పాతమంచిర్యాలలోని రామాలయంలో సోమవారం శ్రీ రామభక్త కరసేవకులను రామానుజ దేవదూత జీయర్‌స్వామి సన్మానించారు. తోట తిరుపతి, బొలిశెట్టి కిషన్, రామగిరి తిరుపతి, పెద్దోజు హన్మంతు, బొలిశెట్టి లక్ష్మణ్, తూముల శ్రీనివాస్, బొలిశెట్టి లచ్చన్నను పూలమాలతో సత్కరించారు. అంతకుముందు సీతారాముల కల్యాణం నిర్వహించారు. అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా తమను సన్మానించడం సంతోషంగా ఉందని కరసేవకులు తెలిపారు.

లోడర్ ప్రారంభం


ప్రారంభిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్‌లో బొగ్గు రవాణాను వేగవంతం చేయడంలో భాగంగా నూతనంగా కొనుగోలు చేసిన భారీ సామర్థ్యం గల లోడర్‌ను శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5.3 కోట్లతో ఈ లోడర్‌ను కొనుగోలు చేసినట్లు తెలిపారు. దీంతో బొగ్గు రవాణా మరింత మెరుగవుతుందన్నారు. ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు అధికారి పురుషోత్తంరెడ్డి, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జి మేనేజర్ శ్రీనివాస్, నాయకులు సత్తయ్య, గని సంక్షేమ అధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి విద్యారత్న అవార్డు


అవార్డును అందజేస్తున్న ప్రిన్సిపాల్

లక్సెట్టిపేట:మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న తన్నీరు సురేశ్‌కు జాతీయ విద్యారత్న పురస్కారం అందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజా తెలిపారు. కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తూ విద్యారంగానికి అందిస్తున్న సేవలకు హైదరాబాద్‌కు చెందిన ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్ డైరెక్టర్ ఇందిరాదేవి అవార్డును కళాశాలకు పంపించారు. కళాశాల ఆవరణలో సోమవారం అవార్డును సురేశ్‌కు ప్రిన్సిపాల్ ప్రదానం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ గంగయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగ్గులో అయోధ్య మందిరం


మంచిర్యాలటౌన్‌: చున్నంబట్టి వాడలో ముగ్గు వేస్తున్న తిరుమల

చెన్నూర్/మంచిర్యాలటౌన్/దండేపల్లి: అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా చెన్నూర్ పట్టణమంతా రామనామస్మరణతో మార్మోగింది. రాములోరిపై ఉన్న భక్తిని పలువురు వివిధ రూపాల్లో చాటుకున్నారు. పుప్పాల హనుమాన్ వీధిలో పుల్యాల అంజన్న కుమార్తె అలేఖ్య ఇంటి ముంగిట రాములోరి గుడిని ముగ్గు వేయగా అందరినీ ఆకట్టుకుంది. ఆదర్శనగర్ కాలనీకి చెందిన బొడ్డు కమల రాముని రూపాన్ని ముగ్గుతో అలంకరించి తన భక్తిని చాటుకున్నారు. మంచిర్యాల పట్టణంలోని చున్నంబట్టికి చెందిన కొండవీటి తిరుమల.. అయోధ్య రామమందిరం ముగ్గును వేసి ఆకట్టుకుంది. దండేపల్లి మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో ఇంటి వాకిళ్లలో కొందరు మహిళలు అయోధ్య రామమందిరం వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.


చెన్నూర్: ఆదర్శనగర్ కాలనీలో రాముని రూపం తీర్చిదిద్దుతున్న కమల


దండేపల్లి: ముగ్గులో అయోధ్య రామమందిరం


చెన్నూర్: అలేఖ్య వేసిన ముగ్గు

ప్రాణంపెట్టి.. ప్రతిమను మలచి

- బాలరాముని ప్రాణప్రతిష్ఠ రోజే మూలవిరాట్ రూపకల్పన
- 12 గంటల్లో మట్టిశిల్పాన్ని తీర్చిదిద్దిన కళాకారుడు భీమేష్


బాలరాముని విగ్రహంతో పోలీస్ భీమేష్

నిర్మల్‌ఖిల్లా: అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం కొనసాగుతుండగానే భక్తి తన్మయత్వంతో అప్పటికప్పుడే మూలవిరాట్ పోలిన శిల్పాన్ని తీర్చిదిద్దాలని సంకల్పించాడు ఆ యువకుడు. అనుకున్నదే తడవుగా దాదాపు 12 గంటల పాటు శ్రమించి మట్టిశిల్పాన్ని జీవకళ ఉట్టిపడేలా తీర్చిదిద్దాడు. నిర్మల్ మండలం అనంతపేట్‌కు చెందిన యువ కళాకారుడు పోలీస్ భీమేష్ సాధారణ బంకమట్టితోనే అద్భుతమైన బాలరాముడి విగ్రహాన్ని చూడచక్కని రూపంలో రూపొందించాడు. సాయంత్రానికల్లా తుది మెరుగులు దిద్దాడు. చెరువుమట్టితో అద్భుతమైన కళాఖండం రూపొందింది. నుదుట తిలకం, చూడచక్కని ముఖ వర్చస్సు, తలపై భాగంనుంచి మెడ వరకు కేశాలు, శిరస్సు భాగాలన్నీ కేవలం చేతితోనే అందమైన ఆకృతిలో మలచడం విశేషం. కేవలం చెరువులోని బంకమట్టి, ఒకటి రెండు సహజరంగులు ఉపయోగించినట్లు పేర్కొంటున్నాడు. బాలరాముని నమూన ప్రతిమ పలువురిని విశేషంగా ఆకట్టుకుంటోంది.

సైకిల్‌పై అయోధ్యకు


సచిన్‌కు పూలమాల వేస్తున్న గ్రామస్తులు


తిర్యాణి: మండలంలోని ఎదులపహాడ్‌కు చెందిన ఆత్రం సచిన్ సైకిల్‌పై అయోధ్యకు బయల్దేరి వెళ్లాడు. అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ పురస్కరించుకుని సోమవారం తన సైకిల్ యాత్రను ప్రారంభించాడు. గ్రామస్తులు సచిన్‌కు రూ.10 వేలు విరాళంగా అందజేశారు.

బియ్యం గింజలతో శ్రీరాముని చిత్రం


సురేఖకు రాముని చిత్రపటాన్ని అందిస్తున్న శిరీష

మంచిర్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ఎమ్మెస్సీ జువాలజీ చదువుతున్న శానగొండ శిరీష బియ్యం గింజలతో శ్రీరాముని చిత్రపటాన్ని తయారు చేసి సోమవారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖకు బహుమతిగా అందించారు. అయోధ్యలో బాలరాము ని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మంచిర్యాలలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, ఆయన సతీమణి సురేఖ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఈ చిత్రపటాన్ని అందించడం ఆనందంగా ఉందని శిరీష తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా


ధర్నా చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

శ్రీరాంపూర్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో జిల్లాల నుంచి రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు. అసోసియేషన్ రాష్ట్ర డెప్యూటీ ప్రధాన కార్యదర్శి అలవేందర్ వేణుమాధవ్ మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు చాలీచాలని పెన్షన్‌తో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డులో కోత విధించొద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభయహస్తం గ్యారెంటీ స్కీంను వర్తింపజేయాలన్నారు. తెల్ల రేషన్‌కార్డులు, ఆసరా పెన్షన్ ఇవ్వాలని కోరారు. 2016 జూలై 1, నుంచి పెరిగిన రూ.20 లక్షల గ్రాట్యూటీని అమలు చేయాలన్నారు. అనంతరం సింగరేణి సీఎండీ బలరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బీరయ్య, జాయింట్ సెక్రెటరీ ఎస్.నర్సింగ్‌రావు, నాయకులు లింగయ్య, లక్ష్మీనారాయణ, రాజిరెడ్డి, సమ్మిరెడ్డి, రాజయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

ఏఐటీయూసీ మద్దతు

ఏఐటీయూసీ అధ్యక్షుడు వి. సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కె.రాజకుమార్ ఈ ధర్నాకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుర్తింపు సంఘంగా తాము రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను యజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరి ష్కారం కోసం పోరాడుతామన్నారు. యూనియన్ అధనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య, నాయకులు శేషయ్య, వెంకట్ పాల్గొన్నారు.